# జీ వి యస్ పీఠికలు

షష్టిపూర్తి ముద్రణం

**ఆచార్య జి.వి సుబ్రహ్మణ్యం**
ఆంధ్ర శాఖ పూర్వాధ్యక్షులు
మానవీయ శాఖ పూర్వాధ్యక్షులు
హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయం

సంపాదకులు:
**డా॥ బి. జయరాములు**
లెక్చరర్, అభ్యుదయ ప్రాచ్య కళాశాల,
హైదరాబాదు.

ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం
**షష్టిపూర్తి ప్రచురణలు**
హైదరాబాదు – 500 044.

**G V S PEETHIKALU**
by Prof. **G.V. Subrahmanyam**
Editor : **Dr. B. Jayaramnlu**

© Author

First Edition : September 1996

Copies : 1000

Price : Rs. 80/-

Cover Design :
**Sri Seela Verraju**

Copies available with
**1. Convenor**
Prof. G.V. Subrahmanyam Shashtipurti Publications
Srivani, 1-8-702/105, Nallakunta
Hydeabad - 500044 Ph : 7633275

**2. Visalandhra Book House**
4-1-435, Vigyana Bhavan, Bank Street
Hyderabad - 500 001, and other Branches

**3. Navodaya Book Sellers**
in Front of Arya Samaj, Kothi, Hyderabad

Printed at :
**Padmavathi Art Printers**
1-1 517/B/1, New Bakaram, Gandhi nagar
Hyderabad - 500 080. Ph : 7611413

Cover page Printed at :
**Vipla Printers Private Ltd..**
Near Shankar Math, Nallakunta
Hyderabad - 500 044.
Ph: 636242, 667476.

# స్వీకర్త

పద్మశ్రీ డా.బోయి భీమన్నగారు

పాలేరు నుండి పద్మశ్రీ దాకా ప్రస్థానం సాగించిన ప్రజానిధి
రాగవైశాఖితో రసాద్వైతాన్ని సాధించిన రాజయోగి
ఉపనిషత్కాల సమసమాజాన్ని దర్శించిన కాలవేది
దీపసభలా కలకాలం వెలుగొందే కావ్యశిల్పి
**పద్మశ్రీ డా॥ బోయి భీమన్నగారికి**
గౌరవ పురస్సరంగా
**అంకితం**

# సమర్పణ

దీపసభ దీర్చి కూర్చున్న ధీరుడతడు
బడుగు పాలేరు గొంతుకు పాటయతడు
రాగవైశాఖి పండుగ రాజతండు
బోయిభీమన్న కవికుల నాయకుండు.

వ్యాస వాల్మీకి మునిసృష్టి భరత నీతి
ఉపనిషత్తులు పాడిన యోగగీతి
అగ్రవర్ణుల కాదర్శమయ్యె ననుచు
భీమకవి కావ్యసిద్ధాంత భూమిక యగు.

భీమన్న ఘంటమ్ము భూమివాసన తోడ
        కస్తూరి గంధమ్ము గుస్తరించు
భీమన్న కంఠమ్ము పేద గుడిసెవాని
        చారిత్రమును నూదు శంఖరవము
భీమన్న తత్త్వమ్ము ప్రేమైక పాత్రమ్ము
        అర్ధనారీశు నవార్థ శక్తి
భీమన్న వచనమ్ము పెనువింటి బాణమై
        లక్ష్యమ్ము భేదించు లక్షణముగ
తన్మయత్వాననొందుఁదా రసాద్వైతమూర్తి
కవనమందున షోడశకళల దీప్తి
స్నేహమనినంత మనసిచ్చు శివుడతండు
వలచి వలపింపగల కావ్య వల్లభుండు.

చిమ్మచీకటి తెరలను చిమ్ముకొనుచు
కుమ్ములాడెడు కులవర్గ గోత్ర తతుల
నడుమ నలుగుచు ముళ్ళపై నడచివచ్చి
మేరుధీరుడవై నేడు మించినావు.

దుర్గమంబైన నీ కాలి త్రోవలోన
వెలుగు లెన్మియొ నిన్నోమి వెంట నడిచె
లేదు వెలుగుకు తరతమ భేదదృష్టి
అనుచు నెలుగెత్తి చాటితి వబ్బురముగ.
భరత ఖండాన పుట్టిన పౌరులెల్ల
హిందు ధర్మమ్ము నడపిన హితులు నుతులు
మతము మార్చిన మాత్రాన మనసు చెడునె
రక్తమొక్కటె సౌజన్య రాగ మొకటె.

ఏ మతస్థుని జంపిన నేమియగును
అన్నదమ్ముల హత్యలె అరసిచూడ
అనుచు జెప్పిన నవ్యమహర్షి యతడు
అతని నర్చింతు పీఠిక నందగించి.

తనదు కృతులకు పీఠికల్ తానెవ్రాసి
ప్రచురణము చేయు విద్యకు పరమగురువు
పీఠికా బ్రహ్మ భీమన్న బిరుదునెంచి
జీవియస్ పీఠికల నిచ్చు చేతమొగ్గి.

## సంపాదకీయం:

# జ్ఞానపీఠికలు

సుప్రసిద్ధ సాహిత్యాచార్యులు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారి షష్టి పూర్తి ఉత్సవాలు ఆయన సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకొని రావడంతో జరుగుతున్నాయి. షష్టిపూర్తి ప్రచురణలలో భాగంగానే 'జీవియస్ పీఠికలు' పుస్తకరూపంలో సాహితీ లోకంలోకి అడుగిడుతూ ఉంది.

నేటి అగ్రశ్రేణి సాహితీ విమర్శకులలో జీవియస్‌గారు ఒకరు. తెలుగు లోని ప్రాచీనాధునిక సాహిత్యాన్ని పుక్కిట బట్టిన అపర అగస్త్యులు. అంతటితో ఆగక తనదైన దర్శనంతో సాహిత్య విమర్శను వెలయించారు. తన విమర్శ మార్గంలో ఆయన చేపట్టని సాహితీ ప్రక్రియగాని, చేపట్టి ఫలవంతం చేయని ప్రక్రియగాని లేదు.

నేటి తెలుగు సాహిత్య విమర్శలో పీఠికలు ప్రత్యేక ప్రక్రియగా వెలుగొందుతున్నాయి. ఆముఖం, ప్రస్తావన, ప్రవేశిక, ప్రకాశిక ఉపోద్ఘాతం, పరిచయం, ముందుమాట, తొలిపలుకు మొదలైన పేర్లతోనేగాక పీఠికలోని విషయాన్ని బట్టి రమణీయమైన శీర్షికలతో గూడ ఇవి సహృదయులను రంజింపజేస్తున్నాయి. విమర్శ రంగంలో పీఠికల పాత్ర అపూర్వమైనది.

ఒక కావ్యాన్నిగానీ, నాటకాన్నిగానీ, నవలనుగానీ, పరిశోధననుగానీ, మరే ఇతర సాహిత్య ప్రక్రియగా వెలుగొందుతున్నాయి. ఆముఖం, ప్రస్తావన, ప్రవేశిక, ప్రకాశిక, ఉపోద్ఘాతం, పరిచయం, ముందుమాట, తొలిపలుకు మొదలైన పేర్లతోనేగాక పీఠికలోని విషయాన్ని బట్టి రమణీయమైన శీర్షికలతో గూడ ఇవి సహృదయులను రంజింపజేస్తున్నాయి. విమర్శ రంగంలో పీఠికల పాత్ర అపూర్వమైనది.

ఒక కావ్యాన్నిగానీ, నాటకాన్నిగానీ, నవలనుగానీ, పరిశోధననుగానీ, మరే ఇతర

సాహిత్య ప్రక్రియనుగానీ అవగాహన చేసుకోవడానికి ఈ పీఠికలు దోహదం చేస్తాయి. అంతేకాదు, వాటి సౌందర్యాన్ని వెలికితీసి, ఆ గ్రంథం చదవడానికి రంగాన్ని సిద్ధం చేస్తాయి.

తెలుగులో మొదటిసారి అచ్చయ్యే గ్రంథాలు, మళ్ళీ పరిష్కరింపబడి ప్రచురింపబడే గ్రంథాలు విమర్శాత్మకమైన పీఠికలతో వెలువడ్డాయి. కందుకూరి వీరేశలింగం పంతులుగారు మొదలుకొని నేటి జీవియస్‌గారి వరకు ప్రామాణికమైన పీఠికలను వెలయించినవారు అనేకులున్నారు. వారిలో వేదం, నిడుదవోలు, వేటూరి ప్రభాకరశాస్త్రి చిలుకూరి నారాయణరావుగారు, బండారు తమ్మయ్యగారు, విశ్వనాథ, రాళ్ళపల్లి, కట్టమంచి, శ్రీశ్రీ, కుందుర్తి వంటివారి పీఠికలు ఆధునిక విమర్శలోకంలో మంచిస్థాయిని, స్థానాన్ని సంపాదించుకున్నాయి. కొందరి పీఠికల మీద పరిశోధనలు కూడా జరిగాయి, జరుగుతున్నాయి.

గురువర్యులు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు నేటి పీఠికా కర్తలలో ముందున్నారని చెప్పవచ్చు. వారు ఏదో ఒక దృక్పథానికి, రాజకీయ సిద్ధాంతానికి కట్టుబడ్డవారు కాదు. నేను ఈ ప్రక్రియను ముట్టుకోను అనే నియమంవారికేం లేదు. అయినా, వారి దర్శనం వారికుంది. ఇప్పటికి వారు అనేక గ్రంథాలకు పీఠికలు వ్రాశారు. వారి పీఠికలు ఇన్ని అని తేల్చి చెప్పడం కష్టం. బహుశా వారికే తాము వ్రాసిన చిన్నా, పెద్దా పీఠికలన్నీ ఎన్నో గుర్తు లేవనుకుంటాను. వారు ఎన్ని పీఠికలు వ్రాసినా – ప్రతి దాంట్లో ఏదో ఒక నూత్న ప్రతిపాదనమో సమన్వయమో ఉంటుంది.

జీవియస్ వ్రాసిన చిన్నా చితకా పీఠికలను కొన్నింటిని వదిలేస్తే తక్కిన పీఠికలన్నిటిలో ఏదో ఒక క్రొత్త విషయం ప్రతిపాదించకుండా ఊరుకోలేదు. సిద్ధాంత గ్రంథానికి పీఠిక వ్రాయవలసి వస్తే దానిలోని గుణదోషాలను కూలం కషంగా చర్చిస్తారు. రచయితకు అవసరమైన సూచనలను ప్రత్యక్షంగానో పరోక్షంగానో అందిస్తారు. సంకలన గ్రంథానికి పీఠిక వ్రాయవలసి వస్తే – దానిలో ఏదో ఒక కొత్త సమన్వయ సూత్రాన్ని ప్రతిపాదించకుండా ఉండరు. ఆయన పీఠికలలో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఎవరైనా ముందుమాట వ్రాయమంటే ఉబుసుపోకకు,

మెచ్చుకోలుకు రెండు మాటలు వ్రాసి వదలరు. ఆ గ్రంథాన్ని సాకల్యంగా పరిశీలించి, దాని పూర్వాపరాలను, లోతుపాతులను పరిశీలించి, అది ఏ ప్రక్రియకు చెందిందో, ఏ తాత్త్విక దృక్పథానికి చెందిందో, ఆ గ్రంథ రచనలో రచయిత మార్గం సాహిత్యానికి, సమాజానికి పనికివచ్చేదో కాదో తేల్చేస్తారు.

ఆయన వ్రాసిన పీఠికలన్నిటిలో వైవిధ్యం గోచరిస్తూ ఉంటుంది. కాని, లోతుగా పరిశీలిస్తే ఆ వైవిధ్యంలో కూడా ఒక అంతస్సూత్రం ఉంటుంది. వారి స్వీయదర్శనమే ఆ అంతస్సూత్రంగా భాసిస్తుంది. విశ్లేషణతోసాగే వారి విమర్శ అపూర్వంగా ఉండడమే గాకుండా ఆధ్యాత్మిక విషయాలు వచ్చినప్పుడు తన్మయీభావంతో వారు చేసే వివేచనం పాఠకులను ఇట్టే ఆకట్టుకుంటుంది. సిద్ధాంతపరమైన చర్చకు దిగినప్పుడు సోపానక్రమంలో, అవసరమైతే సంఖ్యా క్రమంలో విషయాన్ని విశ్లేషిస్తూ, వివరిస్తూ నిగ్గుతేల్చి తమ తీర్పును వినిపిస్తారు.

జీవియస్ పీఠికలన్నీ ఒకే గ్రంథంగా వేయడం సాధ్యంకాని పని. ఇప్పటికి దొరుకుతున్నంతవరకూ పీఠికలన్నింటిని కలిపివేసినా వేయి పేజీలకు మించిన పుస్తకమే అవుతుంది. అందుకని వైవిధ్యం, వైశిష్టం గలిగిన ప్రధానమైన పద్దెనిమిది పీఠికలను గ్రహించి 'జీవియస్ పీఠికలు' అనే ఈ గ్రంథాన్ని షష్టి పూర్తి ప్రచురణగా వెలువరించడం జరుగుతూంది.

ఈ సంకలనంలో మొదటి పీఠిక "తెలుగు కవిత్వపు తీరు తెన్నులు." ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన "సారస్వత వ్యాసములు" ప్రథమ సంపుటానికి ద్వితీయ ముద్రణ పీఠిక ఇది. దీనిలో నన్నయ మొదలు కొని చేమకూర వేంకటకవి వరకు ఆయాకవుల కావ్యలక్షణాలను సాహితీ ప్రస్థానాలను సవిమర్శకంగా వివరించారు.

నన్నయాదుల సాహిత్య ప్రస్థానాలను, కావ్యరుచులను వివరిస్తూ నన్నయది వస్తు ధ్వనియనీ, తిక్కనది రసధ్వనియనీ, ఎఱ్ఱనది అలంకార ధ్వనియనీ వివరించారు. నన్నెచోడుని కవితలో వర్ణ్య వస్తువులోని అలంకార చమత్కృతియే రుచి అన్నారు. పదాలతో ప్రజ్వలన శీలన్ని కల్పించే భావవాహిని సోమనాథుని కవితలోని రుచికున్న గుణం అన్నారు. అలంకార ధ్వని మూలమైన భక్తి కవితా ప్రస్థానం పోతనదనీ,

శ్రీనాథునిది రీతి ప్రస్థానమనీ, ప్రబంధ కవులది అలంకార ప్రస్థానమనీ వివరించారు. ఈ విధమైన వివేచనం ఇంతకు పూర్వం జరుగలేదు. తెలుగు కవిత్వంలోని రుచిభేదాలను సమీక్షించే ఒక వినూత్న వివేచన మార్గంతో కూడిన ఈ పీఠిక 'జీవియస్ పీఠికలు' అనే ఈ గ్రంథానికి 'ఆముఖం' లాగా ఉంటుందని మొట్టమొదట గ్రహించడం జరిగింది. కవిత్వంలో రుచిభేదాల వివేచన అని జీవియస్‌గారు చెప్పుకున్నా ఇవి నేడు సాహిత్య సిద్ధాంతాలుగా రూఢికెక్కాయి. సాహిత్యాన్ని ఈ దృక్పథంతోనే అధ్యయనం చేయడం, బోధించడం జరుగుతూ వుంది.

రెండవ పీఠిక 'తొలి తెలుగు దేశి పురాణము.' ఆం. ప్ర. సాహిత్య అకాడమీవారు 1969 లో పాల్కురికి సోమనాథుని ద్విపద బసవపురాణ సంక్షిప్త ప్రతిని ప్రచురించారు. వీరు దాన్ని పరిష్కరించి వ్రాసిన పీఠిక ఇది. ఈ పీఠికలో పురాణలక్షణాలను వివరించి, జైనపురాణాల ప్రభావాన్ని, వస్తుసంవిధానం, జానుతెనుగు, ద్విపద మొదలైన వివిధ అంశాలను కవి, కులగోత్రాలతో సహా చర్చించి, సోమనాథుని కృతులను, బసవ పురాణానికున్న ప్రశస్తికి వివరించారు. దీనిలో ప్రధానంగా సోమనాథుని బసవపురాణ సంవిధానముపై జైన పురాణ నిర్మాణ ప్రభావం ఉన్నదనీ, అది దేశి పురాణమనీ స్వతంత్రించి మొట్టమొదట నిరూపించడం దీనిలోని నూత్న ప్రతిపాదనం. తొలి తెలుగుపురాణం, అందులో దేశిపురాణం కాబట్టి దీనికి రెండవస్థానం లభించింది.

'ప్రథమాంధ్ర మహాపురాణం' అనేది మూడవది. ఆం.ప్ర సాహిత్య ఆకాడమీ వారే 1984 లో మారన మార్కండేయ పురాణాన్ని ప్రచురించారు. దానికి జీవియస్ సంపాదకులుగా ఉన్నారు. ఆ సంపాదకత్వంలో వ్రాసిన పీఠిక ఇది. దీనిలో పురాణం, మహాపురాణం, పురాణకాలం, మార్కండేయ పురాణ విశిష్టత, అనువాద విధానం, కథాకథన శిల్పం, శైలి మున్నగు అనేక అంశాలను చర్చించారు. ఇది వారి పిహెచ్.డి అంశానికి గ్రహించిన గ్రంథం కావడం వల్ల కూడా అభినివేశంతో అనేక అంశాలను విమర్శనాత్మకంగా వివరించారు. తిక్కన ప్రారంభించిన హరిహరాద్వైత మార్గాన్ని, కావ్య శిల్ప మార్గాన్ని పురాణశైలిలో సంవదించి స్వతంత్ర వ్యక్తిత్వాన్ని మారన ప్రదర్శించాడని ఇందులో ప్రతిపాదించిన నూత్నాంశం. మారనది రసవత్తరమైన పురాణశైలి అని సోదాహరణంగా నిగ్గు దేల్చడం ఇందులోని విశేషం.

కందుకూరి రుద్రకవి రచించిన 'సుగ్రీవ విజయ యక్షగానము'నకు అదే పేరుతో కూర్చిన పీఠిక నాల్గవది. దీనిలో యక్షశబ్దం, యక్షులు, యక్షగానం లక్షణం, మొదటి యక్షగానం, ఇతర ప్రక్రియలు – యక్షగానం అనే అంశాలతో పాటు సుగ్రీవ విజయం గురించిన కూలంకష విమర్శచోటు చేసుకుంది. విషయం సమగ్రమైన పీఠిక ఇది. వివిధ విమర్శకుల అభిప్రాయాలను క్రోడీకరిస్తూ తనదైన మార్గంలో కూర్చిన పీఠిక ఇది.

'అద్భుతరచనము' అనేది ఐదవ పీఠిక. 'దుగ్గన నాసికేతోపాఖ్యానము. పరిశీలనము' అనే సిద్ధాంత గ్రంథానికి వ్రాసిన ముందుమాట ఇది. ఉపనిషత్తు లాదిగా గల కథలను పర్యాలోచిస్తూ ఈ 'పరిశీలనము' లోని నిగ్గును దేల్చారు. నాయక, రస నిర్ణయాలలో సిద్ధాంత గ్రంథకర్త నిర్ణయాలను అంగీకరించలేదు. నాసికేతోపాఖ్యానం శాంత రస ప్రధానమైనదని గ్రంథకర్త నిర్ణయించగా, దీనిలో అద్భుతరసం ప్రధానమైనదని జీవియస్‌గారు ప్రతిపాదించారు. అలాగే నాయకుడు ఉద్దాలకుడని సిద్ధాంతకర్త నిర్ణయించగా నాసికేతుడే నాయకుడని జీవియస్‌గారు సోపపత్తికంగా నిరూపించారు. పీఠికలలో ప్రశంసలు లేదా తిట్లు ఉంటాయనే కొందరి అభిప్రాయానికి ఈ పీఠికే సమాధానం. పరిశోధన బాగున్న చోట ప్రశంసిస్తూనే, లేనిచోట సుకుమారంగా వివరించడం జీవియస్ యొక్క పరిశోధనా ప్రవృత్తి. ఇలాంటి విశిష్టత గల పీఠిక ఇది.

ఆరు, ఏడు పీఠికలు 'ఆనందబిందువు', 'ఆనంద లహరి' అనేవి. ఇవి ఆదిశంకరుల 'శివానందలహరి', 'సౌందల్యలహరి' అనే గ్రంథాలకు గుఱ్ఱంవారు, బూర్గులవారు వ్రాసిన ఆంధ్ర పద్యానువాదాలు. వీటిలోని విషయంలో లీనమై వివరించిన తీరు రెండింటిలోను ఒక్కలాగే ఉంది. 6 వ దానిలో ఉన్న పీఠికలు రెండు కావడంవల్ల ఇలా జరిగింది. మూలం యొక్క మూలంలోకి వెళ్ళి అనువాదం యొక్క అంతంవరకు అనుశీలించడం వీటిలో కనిపిస్తుంది. శంకరుల వాఙ్మయ భారతికి శివానందలహరి, సౌందర్యలహరి రెండు నేత్రాల వంటివి. అనువాదానికి సంబంధించిన పీఠికలుగావున ఈ జంటను గ్రహించనైనది.

ద్వ్యర్థి కావ్యానికి వ్రాసిన చక్కని పీఠిక 'కుమారద్వయ కథాసంవిధానము'. నేడు

కూడా ద్వ్యర్థి కావ్యాలు రావడం ఆశ్చర్యకరమైన విషయం. చక్కటి సంవిధానంతో రెండు కథలు సాగడం, పద్యశిల్పం – వీటిని దీనిలో విమృశించారు పీఠికా కర్త. రాఘవ పాండవీయం, హరిశ్చంద్రనలోపాఖ్యానం మొదలైన ద్వ్యర్థి కావ్యాలను పండితులు, పెద్దలు వ్రాసిన పీఠికలను తలపిస్తూ ఉంది ఈ పీఠిక.

తిక్కనగారి ఆశ్వాసాంత పద్యాలలో ఆ ఆశ్వాసకథ సూచింపబడిందని నిరూపించే విమర్శనా గ్రంథం "భారత కథాంశ సంగ్రహము." ఈ విమర్శరీతి వినూత్నమైనదని ప్రశంసిస్తూ దానికి వ్రాసిన ముందుమాటే 'శిల్పకేతనము' రచయిత యొక్క సమన్వయాలను సమర్థిస్తూనే 'శ్రీమన గౌరినాబరగు…' అనే తిక్కన పద్యాన్ని రచయిత విరాటపర్వానికే సమన్వయించారనీ, కాని విరాటాది పదిహేనుపర్వాలకు దాన్ని సమన్వయించవచ్చునంటూ సమన్వయించి చూపారు జీవియస్‌గారు. ఒక ప్రసిద్ధ వ్యాఖ్యాత చేసిన వ్యాఖ్యానంకంటే విస్తృత సమన్వయాన్ని ప్రతిపాదించే పద్ధతిని సూచించే పీఠిక ఇది.

'అభినవ పోతన' బిరుదాంకితులైన వానమామలై వరదాచార్యులవారి 'వైశాలిని' నాటక పీఠిక 'వైజయంతి' నాటక లక్షణాలు, కథాసంవిధానం, పాత్రచిత్రణం, కవితాతత్త్వం మొదలైనవాటితో నాటకానికి సంబంధించిన ఏ అంశాన్నీ వదలకుండా విమర్శసాగించి, 'అది గొప్ప నాటక' మని స్థాపించి, వరదాచార్యులవారు 'అభినవ కాళిదాసు' లనదగినవారని నిర్ణయించడం, జీవియస్ గారికి ఆ ప్రక్రియపైనున్న అధికారానికి ప్రతీక. ఈ పీఠిక వేదం వేంకటరాయ శాస్త్రిగారు, మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారి లాంటివారు అభిజ్ఞాన శాకుంతలానికి, ఉత్తర రామచరిత్రలకు వ్రాసిన పీఠికలను తలపింపజేస్తుంది.

ఆం. ప్ర. సాహిత్య అకాడమీవారి 'సారస్వత వ్యాసములు' ప్రథమ సంపుటి, ప్రథమ ముద్రణకు వ్రాసిన పీఠిక, 'ఆంధ్ర విమర్శ వికాసము' దీనిలో విమర్శ నిర్వచనం మొదలుకొని విమర్శ వికాస చరిత్రను వివరించడం చూస్తే విమర్శపై వారికున్న పట్టు, వ్యుత్పత్తి మొదలైనవి కళ్ళకు గట్టినట్లుగా దర్శనమిస్తాయి. ఇది ఒక వ్యాససంకలనానికి ఉండవలసినటువంటి భూమిక లాంటిది.

'సారస్వత వ్యాసములు' తృతీయ సంపుటానికి వ్రాసిన పీఠిక "పత్రికా ప్రభ."

దీనిలో ఆంధ్రప్రతిక సంవత్సరాది సంచికలు, సాహిత్య పరిషత్పత్రిక, శారద, భారతి మొ॥ వాటి సాహిత్య సేవను సమీక్షించడం జరిగింది. ఇది చారిత్రక దృష్టితో వ్రాసిన విశ్లేషణాత్మకమైన పీఠిక గాన గ్రహించడం జరిగింది.

ఆధునిక సాహిత్య ప్రక్రియలపై ఆం.ప్ర. సాహిత్య అకాడమీ నిర్వహించిన సాహిత్య గోష్ఠిలో సమర్పించిన వ్యాసాలను సంపుటీకరించిన గ్రంథం సమాలోచనం. ఇటువంటి సంపుటాలకు ఉండవలసిన పీఠికలకు నమూనా వంటిది 'సులోచనం.' ఇది విలువైన పీఠికలలో ఒకటి. దీనిలో జీవియస్ గారు వెలువరించిన కొన్ని అభిప్రాయాలు ఆయన ఆలోచనా సరళిని మనకు పట్టి ఇస్తాయి. "ప్రపంచంతో నడవటమే నేటి మన ఆధునికత, ప్రపంచాన్ని మనతో నడిపించటం ఆధునికత అనుకోవటానికి మరోతరం రావాలి" (పేజీ. 266) అంటారు. కవితా దృక్పథాలను అనుశీలిస్తూ "ఆధ్యాత్మిక ప్రవృత్తిని ఆచరణలో పెట్టలేనంత వరకూ మనకు సద్గతి లేదు. ఈ అంశాన్ని ఆధునిక మని గుర్తించని మన విప్లవ దృక్పథం ఒంటికన్ను చూపు" (పేజి-270). ఈ పీఠికలో దిగంబర, పైగంబర, తిరుగుబాటు, అభ్యుదయ, విప్లవ కవితోద్యమాల గురించీ; నవలారచన, పద్యంస్థితి, గేయంస్థితి, వచన కవిత్వ విస్తృతి, నాటక రంగం మొ॥ అనేక అంశాలపై సాధికారికంగా చర్చసాగించారు.

రాయప్రోలు వారి 'తృణకంకణము' నవీన ముద్రణకు కూర్చిన పీఠిక "రమ్యాలోకానికి రసలోకం మాధురీ దర్శనానికి మణిదీపం." దీనిలో అమలిన శృంగార తత్త్వాన్ని సుదీర్ఘంగా చర్చించి, రాయప్రోలు వారి ఏడు కావ్యాలలో ఆ ప్రేమతత్త్వం ఏయే రూపాలతో దర్శనమిస్తుందో సోపపత్తికంగా సవివరంగా చర్చించారు. ఈ విషయాలను ప్రతిపాదించడంలో జీవియస్‌గారి ప్రత్యేకత సాహిత్య లోకంలో ఇప్పటికే సుప్రతిష్ఠితమై ఉంది. దాన్ని ప్రతిఫలించే ఈ పీఠికను ఆ అభినవ దర్శనానికి నిదర్శనంగా ఎన్నిక చేయడం జరిగింది.

'అహల్య' అనే కావ్యానికి వ్రాసిన ఆముఖమే 'అహల్యభక్తి' ఈ కావ్య విమర్శకు ఉపోద్ఘాతంగా పద్యాన్ని గురించి చర్చిస్తూ "పద్యరచనా శిల్పం ఏ పదిమంది చేతుల్లోనో కుటీర పరిశ్రమగా మిగిలిపోయింది" అని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. పద్యం యొక్క ప్రాధాన్యం, రామకథ విశిష్టత, ఈ కావ్యపు ఔన్నత్యాన్ని విమర్శనాత్మకంగా

వివరించారు. 'తృణకంకణం' భావ కవిత్వంలోని లఘు కావ్యాలకు ప్రతినిధియైతే 'అహల్య' భావ కవిత్వేతర లఘు కావ్య ప్రక్రియకు ప్రతినిధి. దీనిలో భావానికి రచనకు సమప్రాధాన్యం ఉంటుంది. పీఠిక ఆ రెండింటినీ సమదృష్టితో సమీక్షించింది. ఇది సమీక్షాత్మకమైన పీఠిక కావున గ్రహించబడింది.

"ఆంధ్ర మహాభారతము – ద్రౌపది పాత్ర చిత్రణము" అనే డా॥ కె. యస్. ఇందిరాదేవిగారి సిద్ధాంత గ్రంథానికి వ్రాసిన ముందుమాట "పాంచాలీ వజ్రకవచం. "సామాజిక శాస్త్రాల నేపథ్యంతో ఇతిహాసిక పాత్రలను విమర్శించే విధానం ఈ సిద్ధాంత గ్రంథంతో ఉందనీ ఈ పరిశోధనాపథం వినూత్నమైందనీ విశ్లేషించారు. విశ్లేషణాత్మకమైన పీఠికగాన గ్రహించడం జరిగింది.

'చలంకథ – వాసుదర్శనం' అనే పీఠిక డా॥ వావిలాల సుబ్బారావుగారి "చలంగారి కథానికా సాహిత్యము అనుశీలనము" అనే సిద్ధాంత గ్రంథానికి వ్రాసినది. స్త్రీ పురుష సంబంధాల ఆధారంగా చలం సాహిత్యం సృష్టించబడిందని అంటూ చలం తత్త్వాన్నీ, శాంతినీ, పరిపూర్ణతనూ, ప్రేమనూ కోరుతూ ఉంటుంది. రెండవది దాన్ని సాధించటానికి జీవితంలో స్త్రీ ఒక దివ్యమై సాధనంగా భావించి రమిస్తూ ఉంటుంది" అంటారు.

"ఈ పరిశోధకుని నిర్ణయాలన్నీ ఆదర్శాలనీ, నిర్దుష్టాలనీ చెప్పలేం. వారు భావించిన 'శృంగారవీరం' లాక్షణికార్థంలో అర్థరహితం. చలంగారి అర్థంలోని శృంగారమే అయితే ఆది ఔచిత్య రహితం" అని నిర్మొహమాటంగా చెబుతారు.

చివరగా తీసికొన్న పీఠిక 'యుగకర్త విశ్వనాథ.' విశ్వనాథ కవితా వైభవం', 'విశ్వనాథ సాహితీ సమాలోచనం' అనే గ్రంథాలకు జీవియస్‌గారు వ్రాసిన పీఠికలు ఇవి. నవ్య సంప్రదాయోద్యమ నాయకుడైన విశ్వనాథ కవిత్వాన్ని సమీక్షించే పీఠికలు ఇవి.

చలం, విశ్వనాథల శతజయంతి ఉత్సవాలు గత సంవత్సరమే జరిగాయి. అందువల్ల ఈ రెండు పీఠికలు గ్రహించడం జరిగింది.

ఈ విధంగా నేను గ్రహించిన పద్దెనిమిది పీఠికలను పరిశీలిస్తే వాటిలోని వైవిధ్యం, వైశిష్ట్యం గోచరిస్తుంది. ఈ క్రమాన్నే ఎందుకు పాటించానో విజ్ఞులు గ్రహించే

ఉంటారు. వీటిలో ఉండే అంతస్సూత్రాన్ని గ్రహించడానికి పెద్ద శ్రమ పడవలసిన పని లేదు. అదే ఈ గ్రంథ ప్రయోజనం కూడా 1. జీవియస్ గారి దర్శనాన్ని గ్రహించడం, 2. తెలుగు సాహిత్యం యొక్క సమగ్ర స్వరూపాన్ని పాఠకులకు అందించడం.

ఈ పద్దెనిమిది పీఠికలు వివిధ ప్రక్రియల పరిజ్ఞానాన్ని కూడా పాఠకుని కందిస్తాయని, తద్వారా 'జీవియస్ పీఠికలు' జ్ఞానపీఠికలుగా వెలుగొందుతాయని భావిస్తున్నాను. అంతేకాదు, పై పీఠికాకర్తల శ్రేణిలో జీవియస్‌గారు నిలుస్తారని నిస్సంశయంగా చెప్పవచ్చు.

"సుమదామ సంగ్రథన శిల్పము వంటిది సంకలన గ్రంథ సంపాదకత్వము. కంటికింపయిన రంగుల నేర్చికూర్చి సౌరభ్య సంవాసితమైన మనోహరాకృతిని మలచుటయే యాకళలోని కౌశల్యము. సభ్య భాషా సాహిత్యములయందు వైవిధ్యముగాని వైశిష్ట్యముగాని గల సాహిత్య ప్రక్రియలో సరులన గ్రంథములు వెలయుల పరిపాటియే" అన్నారు జీవియస్‌గారు. ఈ పీఠికాసంకలనంలో వైవిధ్యం, వైశిష్ట్యం రెండూ ఉన్నాయి.

వారి శైలి గురించి ఒక మాట. ప్రతిపాద్యాంశాన్ని బట్టి పదాలు, వాక్యాలు వాటంతటవే ఆ ప్రయత్నంగా వారి కలం నుండి జాలువారుతాయి. ఎంతటి గంభీరవిషయాలనైనా తమ రచనా పటిమతో పాఠకుని ఉత్తేజపరిచి చదివింపజేస్తారు. ఉదాహరణకు చలం శైలి గురించి, విశ్వనాథ శైలి గురించి వారన్న మాటలు–

"నరాలను మీటుతూ అక్షరాలను మ్రోగించిన అనుభవ సంవేదన చలం శైలి"–

"విశ్వనాథవారి శైలి ఒడ్డులోరసి ప్రవహించే తెలుగు జీవనదిలాంటిది."

ఈ గ్రంథం మహాకవి, కళాప్రపూర్ణ డా. బోయి భీమన్నగారికి అంకితం ఇవ్వడం సముచితం. వారు రచించిన ప్రతి రచన ఒక వినూత్న, విశిష్ట ప్రయోగం. వారి కావ్యాలకు బెర్నార్డ్‌షా లాగా వారే పీఠికలు వ్రాసుకుంటారు. వారి పీఠికలలో వారు మెదడుతో మాట్లాడుతారు. కవితలలో హృదయంతో స్పందిస్తారు. జీవియస్‌గారు వారిని 21 వ శతాబ్దపు ఋషిగా అభివర్ణించారు. 'ఋషి' కంకితమైన 'ఋక్సంహిత' ఈ గ్రంథం. వారు గ్రంథాన్ని స్వీకరించడానికి దయతో అంగీకరించినందుకు

హృదయపూర్వక కృతజ్ఞతలు.

ప్రసిద్ధ విమర్శకులు, ఆంధ్రాచార్యులు డా. ఎస్. వి. రామారావుగారు ఈ గ్రంథానికి విలువైన "ఆముఖం" సంతరించి వెలుగును నింపారు. వారికి నా కృతజ్ఞతలు.

ఈ పీఠికలను తమ గ్రంథాలలో ప్రచురించిన వివిధ సంస్థతలు, రచయితలు ఈ పీఠికలను షష్టిపూర్తి ప్రచురణగా తీసుకొనిరావడానికి అంగీకరించారు. వారికి కృతజ్ఞతాభివందనాలు.

ఈ గ్రంథం శుద్ధప్రతిని సిద్ధం చేయడంలో సహకరించిన కుమారి మృదుల, కుమారి భారతిగార్లకు కృతజ్ఞతలు.

ముఖచిత్ర రచయిత శ్రీశీలా వీర్రాజుగారికిచ పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్‌కు, విప్లా ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి కృతజ్ఞతాభివందనాలు.

ఈ గ్రంథానికి సంపాదకత్వం వహించడానికి గురువుగారు అమిత వాత్సల్యంతో నన్ను ఆదేశిస్తే ఈ పనికి పూనుకున్నాను. వారి షష్టిపూర్తి సందర్భంగా నాకీ అవకాశాన్నిచ్చిన గురువుగారికీ, ఈ గ్రంథాన్ని ప్రచురిస్తున్న షష్టిపూర్తి సారథ్య సంఘం వారికీ నా హృదయపూర్వక నమోవాకాలు.

హైదరాబాదు **బి. జయరాములు**

18–9–1996 సంపాదకుడు

## ముందుమాట:

# ఆముఖం

**– ఆచార్య ఎస్వీ రామారావు**

ఆధునికాంధ్ర వాఙ్మయంలో పీఠికా రచన విశిష్ట విమర్శనా ప్రక్రియగా విలసిల్లుతున్నది. ప్రాచీనయుగంలో కావ్యావతారికల రూపంలో కొనసాగిన ఈ ప్రక్రియ అర్వాచీన కాలంలో వినూత్న స్వరూపాన్ని సంతరించుకొన్నది. అవతారికలు కవుల ఆత్మీయతను ప్రతిఫలించగా, పీఠికలు విద్వాంసుల సహృదయతను ప్రతిబింబించాయి.

గత శతాబ్దిలో గ్రంథ ముద్రణా సౌకర్యం ఏర్పడిన నాటినుంచి కావ్య పరిష్కరణలో భాగంగా పీఠికా రచన ప్రారంభమైంది. పాఠభేదాల పరిశీలన, కవి దేశకాలాలు, కావ్యకర్తృత్వ చర్చలు మొ॥ అంశాలు ప్రారంభదశలోని పీఠికల్లో గోచరిస్తాయి. క్రమంగా బాహ్యాంగ విచారణ నుంచి అంతరంగ వివేచనవైపు పీఠికా కర్తల దృష్టి ప్రసరించింది. కావ్యాత్మ వివేచకములైన, కావ్యతత్త్వ ప్రకాశకములైన పీఠికలు వెలువడసాగాయి. కట్టమంచి, రాళ్ళపల్లి, పింగళి ప్రభృతులు పీఠికా రచనలో కొత్త ఒరవడికి దారి చూపారు. పరిష్కృత కావ్యాలు, లక్షణ గ్రంథాల పీఠికలు ఒకవైపు, సృజనాత్మక రచనలైన ఆధునిక కావ్యాలు, కథలు మున్నగువాని పీఠికలు మరొకవైపు విమర్శ వికాసానికి ఎంతగానో దోహదం చేశాయి.

అక్కిరాజు ఉమాకాంతం (పల్నాటి వీరచరిత్ర), చిలుకూరి నారాయణ రావు (పండితారాధ్య చరిత్ర), ఈయుణ్ణి వీరరాఘవాచార్యులు (ఆంధ్ర ప్రతాప రుద్ర యశోభూషణం, ఆముక్త మాల్యద పర్యాలోకనం) మున్నగు సాహితీ వేత్తలు రూపొందించిన విపుల పీఠికలు విషయ పరిపూర్ణములై వారి సర్వాంగీణ వైదుష్యానికి నిదర్శనంగా నిలచాయి. శ్రీశ్రీ మహాప్రస్థానానికి చలం యోగ్యతా పత్రం, దాశరథీ గాలిబ్ గీతాలకు బూర్గుల రామకృష్ణరావు, దాశరథీ శతకానికి నిడదవోలు వెంకటరావు

పీఠికలు, ఎమెస్కోవారి సంప్రదాయ సాహితిలోని కావ్యాలకు విశ్వనాథ, సాహిత్య అకాడమీ ప్రచురించిన ప్రాచీనాంధ్ర కావ్యాలకు పలువురు విద్వాంసులు సమకూర్చిన పీఠికలు – ఇలా విశిష్ట పీఠికా పరంపరను గూర్చి చెప్పుకుంటూపోతే చరిత్ర అవుతుంది.

ఆంధ్రపత్రిక ప్రకటించిన 'ఆంధ్రవాఙ్మయ సూచిక' కు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి ఉపోద్ఘాతం 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర'గా ప్రత్యేక గ్రంథరూపం దాల్చిందంటే పీఠికా సాహిత్యానికి గత ప్రాధాన్యం ఎటువంటిదో తెల్లమవుతోంది. విమర్శ వాఙ్మయంతో దీనికి ప్రత్యేక శాఖగా గుర్తింపు రావటంలో వ్యాస సంకలనాల వలె వివిధ రచయితల పీఠికా సంకలనాలు కూడ వెలువడ్డాయి. సి.ఆర్. రెడ్డి, రాళ్ళపల్లి వేటూరి, కుందుర్తి, విశ్వనాథ, శ్రీశ్రీ ప్రభృతుల పీఠికలు ఈ కోవలో పేర్కొనదగినవి. అంతేకాదు – విశ్వవిద్యాలయస్థాయిలో పీఠికా సాహిత్యంపై ప్రత్యేకాధ్యయనం కూడా కొనసాగుతున్నది.

వర్తమాన సాహితీరంగంలో పరిశోధకుడుగా, విమర్శకుడుగా, ఆచార్యుడుగా సమున్నత స్థానాన్ని అధివసించిన సాహితీవేత్త జి.వి. సుబ్రహ్మణ్యంగారు. పీఠికారచనలో కూడా తనదైన ప్రత్యేకతను, వ్యక్తిత్వాన్ని నిలుపుకొన్న జీవియస్ పీఠికలు సంకలనరూపం దాల్చటం సహృదయ పాఠకులకు హర్షామోదయోగ్యం.

ప్రాచీనాధునిక కావ్యాలు, సిద్ధాంత వ్యాసాలు, వ్యాస సంకలనాలు మున్నగు వానికి వివిధ సందర్భాలలో జీవియస్ కూర్చిన పీఠికలు ఈ సంకలనంలో చేర్చబడ్డాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఆకాడమీ ప్రచురణలైన బసవ పురాణ, మార్కండేయ పురాణ పీఠికల్లో పురాణ ప్రక్రియా లక్షణాలను వినూత్న దృష్టితో విశ్లేషించటంలో జీవియస్ ప్రతిభ ద్యోతకమవుతుంది. పాల్కురికి సోమన బసవపురాణం జైనపురాణ ప్రభావంతో వెలువడిన తొలి తెలుగు దేశి పురాణంగా, మారన మార్కండేయపురాణం మార్గ సంప్రదాయానికి చెందిన ప్రథమాంధ్ర పురాణంగా సశాస్త్రీయంగా, సప్రమాణంగా ఆయన నిరూపించారు. ప్రథమాంధ్ర యక్షగానమైన 'సుగ్రీవవిజయం' ఆముఖంలో కూడా యక్షగాన లక్షణాలను విపులంగా వివేచించి కావ్యతత్త్వాన్ని స్పష్టం కావించారు.

వ్యాస సంకలనాలకు సంపాదకుడుగా కూడ జీవియస్ నిర్వహించిన బాధ్యత గణనీయమైనది. అకాడమీ ప్రకటించిన 'సారస్వత వ్యాసములు' ప్రథమ, తృతీయ సంపుటాలలోని వ్యాసాల ఎంపికతోపాటు వాటికి విరచించిన భూమికలు విశిష్టమైనవి. కవిత్రయ యుగం నుంచి ప్రబంధయుగం దాకా విలసిల్లిన తెలుగు కవిత తీరు తెన్నులను, వివిధ రూపాలలో విస్తరించిన ఆంధ్ర విమర్శ వికాసాన్ని, తొలినాటి సాహిత్య పత్రికలు కావించిన సారస్వత సేవను అవి హృద్యంగా విశదీకరించాయి. 'సమాలోచనం' వ్యాససంపుటికి సమకూర్చిన 'సులోచనం' ఆధునిక సాహిత్య ప్రక్రియలపై ప్రసరించిన ఆయన పరిశీలనా చక్షువుకు నిదర్శనం.

విశ్వవిద్యాలయాల్లో వినూత్నాంశ వివేచనకు వీలు కల్పించి ఎందరో పరిశోధక విద్యార్థులను తీర్చిదిద్ది పర్యవేక్షకుడుగా, శాఖాధిపతిగా పరిశోధనారంగంలో క్రొత్త గవాక్షాలు తెరిచిన ఆచార్యవర్యులు సుబ్రహ్మణ్యంగారు. దుగ్గన నాసికేతో పాఖ్యానము – పరిశీలనము (డా॥ కె. కోదండ రామాచార్యులు), ఆంధ్ర మహా భారతము – ద్రౌపది పాత్ర చిత్రణము (డా॥ కె.యస్. ఇందిరాదేవి) సిద్ధాంత వ్యాసాల పీఠికల్లో సైతం ఆయన పర్యవేక్షకతత్త్వం ప్రకాశిస్తుంది.

ఏకవీర కుమారీయము (ద్వ్యర్థి కావ్యం), వైశాలిని (నాటకం), ఆహల్య (కావ్యం), మున్నగు కృతుల పీఠికలు కూడ ఈ సంకలనంలో చోటు చేసుకొన్నాయి. రాయప్రోలు తృణ కంకణం నూత్న ముద్రణకు చేర్చిన పీఠికలో ఆమలిన శృంగార సిద్ధాంతాన్ని సాంగోపాంగంగా, సహృదయంగమంగా విశదీకరించారు. ఆధ్యాత్మిక తత్త్వవివేచనలో కూడా జీవియస్ అందెవేసిన చేయి. శంకరభగవత్పాదుల శివానందలహరి, సౌందర్యలహరి ఆంధ్రానువాదాలకు రచించిన తొలిపలుకులు ఆయన ఆలోచనామృతానికి నెలవులు.

జీవియస్ పీఠికలు వివిధ సాహితీ ప్రక్రియలపై ఆయనకు గల సమ్యగవగాహనకు, సునిశిత పరిశీలనా దృష్టికి విన్నూత్న విశ్లేషణాశక్తికి, విశిష్ట విమర్శనా పంథకు దిటురాళ్ళు. ఇవికాక వివిధ గ్రంథాలకు ఆయన వ్రాసిన పీఠికలు అసంఖ్యాకం. వాటిలో ఆణిముత్యాలను ఏరి విమర్శభారతికి అమూల్యాభరణం కైసేసిన షష్టిపూర్తి సంఘ నిర్వాహకులకు నా అభినందనలు.

## ఇందులో....


| | | |
|---|---|---|
| 1. | తెలుగు కవిత్వపు తీరుతెన్నులు | 1 |
| 2. | తొలి తెలుగు దేశిపురాణము | 28 |
| 3. | ప్రథమాంధ్ర మహాపురాణము | 78 |
| 4. | సుగ్రీవ విజయ యక్షగానము | 124 |
| 5. | అద్భుత రచనము | 153 |
| 6. | ఆనంద బిందువు | 162 |
| 7. | ఆనంద లహరి | 172 |
| 8. | కుమారద్వయం కథాసంవిధానము | 179 |
| 9. | శిల్పకేతనము | 191 |
| 10. | వైజయంతి | 200 |
| 11. | ఆంధ్ర విమర్శ వికాసము | 223 |
| 12. | పత్రికాప్రభ | 254 |
| 13. | సులోచనం | 264 |
| 14. | రమ్యాలోకానికి రసలోకం మాధురీ దర్శనానికి మణిదీపం | 291 |
| 15. | అహల్యా భక్తి | 312 |
| 16. | పాంచాలీ వజ్రకవచం | 322 |
| 17. | చలంకథ – వాసుదర్శనం | 333 |
| 18. | యుగకర్త విశ్వనాథ | 341 |